# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేదీ : 21-09-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. రహదారుల నిర్మాణంలో ఆధునిక సాంకేతికతను వినియోగించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె పవన్‌కల్యాణ్ సూచించారు.**

**2. దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుపరిపాలన అందిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు.**

**3. రాజధాని అమరావతిలోని 29 గ్రామాల రైతుల కోసం 'సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ డే' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది.**

**3. ఈ రోజు అల్జీమర్స్ వ్యాధి అవగాహనా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

**4. ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.**

**5. చిత్తూరుజిల్లా కాణిపాక వరసిద్ధి వినాయకుని బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి.**

==========================

రహదారుల నిర్మాణంలో ఆధునిక సాంకేతికతను వినియోగించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె పవన్‌కల్యాణ్ సూచించారు. రాష్ట్రంలో చేపడుతున్న గ్రామీణ రహదారుల పనులపై సంబంధిత అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో వేసే రహదారులు వరదలకు దెబ్బతినకుండా నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో రహదారులు నిర్మించాలని, గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి రహదారులతో పాటు వంతెనల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

--------------------------

దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుపరిపాలన అందిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు. తిరుపతిలో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా నిరుపేదల లబ్ధి పొందుతున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీకి 18 కోట్ల మంది కార్యకర్తలు ఉన్నారని, సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని మంత్రి పేర్కొన్నారు.

--------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం తొలి వంద రోజుల పాలన పూర్తి చేసుకుంది. ఈ వంద రోజుల పాలనలో ఆయుష్మాన్ భారత్, లఖ్‌పత్ దీదీ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల పరిధిని మరింత విస్తృతం చేయడంవల్ల ఆ పథకాలు తమకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తిరుపతి జిల్లాకు చెందిన పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆకాశవాణితో వారు మాట్లాడుతూ,

వాయిస్ (40 సెకన్లు)

--------------------------

రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు ప్రారంభమైనందున రాజధాని ప్రాంత పరిధిలోని 29 గ్రామాల రైతుల కోసం 'సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ డే' కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ కమిషనర్ కాటంనేని భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శుక్రవారం తుళ్లూరులోని సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం జరుగుతుందని, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో అమరావతి ప్రాంత రైతులు పాల్గొని వారి సమస్యలు పరిష్కరించుకోవచ్చని కమిషనర్ సూచించారు..

--------------------------

మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని నీతి ఆయోగ్ సభ్యులు విజయ్ కుమార్ సరస్వత్ కోరారు. ఏక్ పేడ్ మాకే నామ్ – అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లా ఏర్పేడులోని భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థలో ఈరోజు విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం విజయ్ కుమార్ మాట్లాడుతూ మొక్కల సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

--------------------------

సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈరోజు 6 గంటలు ఆలస్యంగా నడుస్తోందని రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రోజు ఉదయం 5 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరవలసిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈరోజు ఉదయం 11 గంటలకు బయలుదేరిందని పేర్కొన్నారు. ప్రయాణీకులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

--------------------------

ఈ రోజు అల్జీమర్స్ వ్యాధి అవగాహనా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అల్జీమర్స్ అంటే జ్ఞాపక శక్తి కోల్పోవడం. ఇది నాడీ సంబంధిత రుగ్మత. వృద్ధులపై ఈ వ్యాధి ప్రభావం అధికంగా ఉంటుంది. జన్యుపరమైన కారణాల వల్ల కూడా ఈ వ్యాధి సంభవించే అవకాశం ఉంది. ఈ వ్యాధికి గురైన వారు జ్ఞాపక శక్తిని కోల్పోతారు. మనిషి మెదడులో అసాధారణమైన ప్రోటీన్ నిక్షేపాలు చేరడం వల్ల ఈ వ్యాధి సంక్రమించే అవకాశం ఉంటుంది. 1994 సంవత్సరంలో జరిగిన అల్జీమర్స్ డిసీజ్ ఇంటర్నేషనల్–ఏ.డి.ఐ. సంస్థ పదవ వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రతి ఏటా సెప్టెంబర్ 21 వ తేదీన ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ వ్యాధి రాకుండా ఉండాలంటే మెదడుకు ఎల్లప్పుడూ పని చెబుతూ ఉండాలని, రకరకాల పజిల్స్, లెక్కలు వేయాలని, బలవర్ధకమైన ఆహారం తీసుకుంటూ నడక, యోగా వంటి వ్యాయామాలు అను నిత్యం నిర్వహించాలని వైద్యులు సూచిస్తున్నారు.

కాగా అల్జీమర్స్ వ్యాధి అవగాహనా దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ మధ్యాహ్నం 3 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 114వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

తీర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిరిపై ఉందని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ – ఇన్ కాయిస్ శాస్త్రవేత్త చంద్రశేఖర్ అన్నారు. అంతర్జాతీయ తీర ప్రాంత పరిశుభ్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని కొత్తపట్నం తీర ప్రాంతంలో తీర పరిశుభ్రతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్.సి.సి. క్యాడెట్లు, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు,అధికారులు తీర ప్రాంతంలోని వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు.

---------------------------

స్వచ్ఛ భారత్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం డైరెక్టర్ బాలాజీ అన్నారు. ఈరోజు శ్రీకాకుళంలోని వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్టోబరు 2వ తేదీ వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పచ్చదనం – పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, నీటి వినియోగం, స్వచ్ఛసేవా వంటి పలు కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

---------------------------

పరిసరాల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఎచ్చెర్ల శాసనసభ్యులు ఎన్. ఈశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవంలో భాగంగా శ్రీకాకుళం జిల్లాలోని బుడగట్లపాలెం గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛ సాగర్ –సురక్షిత సాగర్ కార్యక్రమంలో పాల్గొని సముద్రతీరంలోని వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సముద్ర తీరాన్ని పరిశుభ్రంగా ఉంచడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. బుడగట్ల పాలెంలో నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్ త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని తెలిపారు.

---------------------------

ఏలూరు జిల్లాలోని నూజివీడు ట్రిపుల్ ఐటీలోని భోజనశాలను రాష్ట్ర కళాశాల విద్యా శాఖ కమీషనర్ పోలా భాస్కర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి భోజనశాలలో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులను కలిసి భోజనం నాణ్యత గురించి కమీషనర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అధికారులను ఆదేశించారు.

--------------------------

చిత్తూరుజిల్లా కాణిపాక వరసిద్ధి వినాయకుని బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు ఉదయం వాహన సేవల్లో ప్రధాన ఘట్టమైన పుష్ప పల్లకి సేవను నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించిన పుష్ప పల్లకిపై స్వామివారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

======================